సాక్షి నిజామాబాద్

గురువారం । 14 । సెప్టెంబర్ । 2023



అమ్మో చిన్నాపూర్ గండి

చిన్నాపూర్ గండిలో మళ్లీ దొంగతనాలు జరుగుతున్నాయి. దీంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

- 8లో ▸



ఎమ్మార్సీలకు తాళాలు

సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని సమ్మెలో పాల్గొనడంతో ఎమ్మార్సీలకు తాళాలు పడ్డాయి.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
30.8 /24.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండతీవ్రత ఉంటుంది. సాయంత్రం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

కాంగ్రెస్ విజయభేరి కోసం సమన్వయకర్తలు

- భారీ జనసమీకరణకు ప్రణాళికలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 17న హైదరాబాద్‌లోని తుక్కుగూడ వద్ద నిర్వహించ తలపెట్టిన 'విజయభేరి' సభకు జన సమీకరణ చేసేందుకు పార్టీ నాయకత్వం శాసనసభ నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను నియమించింది. ఈ మేరకు బుధవారం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఇన్‌చార్జి ఆర్గనైజర్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ సంబంధిత సమన్వయకర్తల జాబితాను విడుదల చేశారు. జిల్లాలోని ఆర్మూర్ నియోజకవర్గానికి సీహెచ్ రాంభూపాల్, బోధన్‌కు బాడ్సి మోతుకూరి శేఖర్‌గౌడ్, నిజామాబాద్ అర్బన్‌కు సీహెచ్ బాలరాజు, నిజామాబాద్ రూరల్‌కు మహ్మద్ ఈసా, బాల్కొండకు అన్నయ్యగౌడ్, బాన్సువాడ నియోజకవర్గానికి జావీద్ అక్రంను నియమించారు. పార్టీ అగ్రనేతలందరూ పాల్గొనే ఈ సభను విజయవంతం చేసేందుకు భారీ స్థాయిలో జనసమీకరణ చేసేందుకు సమన్వయకర్తలను నియమించడంతో పాటు బుధవారం డిచ్‌పల్లిలో జిల్లా పార్టీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం సైతం నిర్వహించారు.

15న జాబ్‌మేళా

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సిరిమల్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. శివాజీనగర్‌లోని ఉపాధి కల్పన కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి 2.30 గంటల వరకు మేళా ఉంటుందన్నారు. రిలేషన్‌షిప్ మేనేజర్ జాబ్‌లు ఉన్నాయని, 18 ఏళ్ల నుంచి 26 ఏళ్లలోపు వారు అర్హులని వివరించారు. వివరాలకు 6305743423, 9959456793 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఉమ్మడి జిల్లాకు భారీ వర్ష సూచన

రుద్రూర్: ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో మూడు రోజులు (ఈ నెల 14, 15, 16 తేదీల్లో) ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కేవీకే శాస్త్రవేత్త శ్రీలక్ష్మి తెలిపారు. రైతులు పొలాల్లో రసాయన మందులను మూడు రోజుల పాటు పిచికారి చేయొద్దని సూచించారు.

నిలకడగా 'సాగర్' నీటిమట్టం

నిజాంసాగర్(జుక్కల్) : ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో బుధవారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 4,000 వేలక్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తోంది. ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గడంతో మంజీరలోకి నీటి విడుదలను నిలిపేశారు. నిజాంసాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1405 అడుగు 17.8 టీఎంసీలకుగాను ప్రస్తుతం 1404.94 అడుగులు 17.72 టీఎంసీల నీరు నిల్వ ఉందని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు.

డెంగీతో విద్యార్థి మృతి



భరత్ (ఫైల్)


నిజామాబాద్‌నాగారం: డెంగీ కేసులు జిల్లాలో క్రమంగా పెరుగుతున్నాయి. ఇందల్‌వాయి మండలం తిర్మన్‌పల్లి కి చెందిన బీటెక్ విద్యార్థి భరత్ డెంగీతో బుధవారం మృతి చెందాడు. మూడు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని ఓ ప్రముఖ ప్రైవేట్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేరాడు. మంగళవారం విద్యార్థి పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు హైద్రాబాద్‌లోని నిమ్స్‌కు తలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. జిల్లాలో రెండు నెలల్లో 120 వరకు డెంగీ కేసులు నమోదు అయ్యాయి. ప్రైవేట్ ఆస్పత్రులకు నిత్యం పదుల సంఖ్యలో డెంగీ బాధితులు వస్తున్నా అధికారికంగా నమోదు కావడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రిలో జూలై, ఆగష్ లో ఒక్కొక్కరి చొప్పున డెంగీతో మరణించినట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.

నేడు మంత్రి తలసాని రాక

డొంకేశ్వర్(ఆర్మూర్): రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం జిల్లాకు రానున్నారు. జిల్లా కేంద్రంలోని అర్సపల్లిలో నీలి విప్లవం పథకం కింద రూ.2కోట్లతో నిర్మించనున్న హోల్‌సేల్ అండ్ రిటైల్ ఫిష్ మార్కెట్‌కు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం ఉచిత చేప పిల్లల పంపిణీని ప్రారంభిస్తారు. మోపాల్ మండలం న్యాల్‌కల్‌లోని మాసాని చెరువులో చేపపిల్లలను వదలనున్నారు. అక్కడే మత్స్యకారులతో మంత్రి భేటీ కానున్నారు.

జమిలి టెన్షన్..

- ప్రచారానికి వెళ్లడంలో వెనుకాముందు అవుతున్న బీఆర్‌ఎస్ సిట్టింగులు
- క్షేత్రస్థాయిలో స్పీడ్‌గా కాంగ్రెస్, బీజేపీ టిక్కెట్ల ఆశావహులు
- అభివృద్ధి పనుల నిధుల మంజూరుకు ప్రొసీడింగ్స్ ఇస్తున్న ఎమ్మెల్యేలు



శాసనసభ, లోక్‌సభ స్థానాలకు జమిలి ఎన్నికలు జరుగుతాయంటున్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు తమ ప్రచారంలో నెమ్మదించారు. జమిలి ఎన్నికలు వస్తే పరిస్థితి ఏంటి, లాభమా, నష్టమా.. లెక్కలు వేసుకుంటున్నారు. కాంగ్రెస్, బీజేపీలు అభ్యర్థుల ఎంపికకు సంబంధించి సర్వేలు చేస్తున్నాయి. దీంతో తమ పేరు ముందంజలో ఉండాలనే లక్ష్యంతో టిక్కెట్ల ఆశావహులు క్షేత్రస్థాయిలో బాగా తిరుగుతున్నారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: శాసనసభ, లోక్‌సభ సాధారణ ఎన్నికలకు మధ్య కేవలం నాలుగు నెలల సమయం మాత్రమే ఉండడంతో కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికల అంశాన్ని తెరపైకి తెచ్చింది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికలు ముందుకొస్తాయా, శాసనసభ ఎన్నికలు మరో రెండు నెలలు ఆలస్యం అవుతాయా అనే విషయమై సర్వత్రా చర్చ జరుగుతోంది. దీంతో ఇప్పటికే మరోసారి టిక్కెట్లు దక్కించుకున్న బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమ ప్రచార పర్వాన్ని ఒకింత నెమ్మదించారు. ప్రచారం క్రతువు ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కాగా సిట్టింగ్ ఎమ్మెల్యేలు కొన్ని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, నిధుల మంజూరుకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను పంపిణీ చేస్తున్నారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మాత్రం రెగ్యులర్‌గా పంపిణీ చేస్తూ ముందుకు వెళుతున్నారు. ఎన్నికలు ఎప్పుడు వస్తాయో, నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందో అనే ఆలోచనతో ఉంటున్నారు. జమిలి ఎన్నికలు వస్తే పరిస్థితి ఎలా ఉంటుంది, ఆలస్యమైతే పరిస్థితి ఏంటి, లాభమా, నష్టమా అనేవిషమయై లెక్కలు వేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా బాల్కొండ, ఆర్మూర్, బోధన్ ఎమ్మెల్యేలు మాత్రం ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇచ్చే కార్యక్రమాన్ని ముమ్మరంగా నడిపిస్తున్నారు.


సర్వేల నేపథ్యంలో..

బీఆర్‌ఎస్ ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేయగా, కాంగ్రెస్, బీజేపీలు మాత్రం దరఖాస్తులు స్వీకరించడం, వాటిని క్రోడీకరించడం ప్రక్రియను కొనసాగిస్తున్నాయి. ఈ రెండు పార్టీలు అభ్యర్థుల ఎంపికకు సంబంధించి సర్వేలు చేస్తున్నాయి. సర్వేల నేపథ్యంలో తమ పేరు ముందంజలో ఉండాలనే లక్ష్యంతో టిక్కెట్ల ఆశావహులు క్షేత్రస్థాయిలో బాగా తిరుగుతున్నారు. నిజామాబాద్ అర్బన్ నుంచి బరిలో ఉండాలనే లక్ష్యంతో ఉన్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, పీసీ సీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్‌హందాన్, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్, నగర పార్టీ అధ్య క్షుడు కేశవేణు క్షేత్రస్థాయిలోకి వెళ్తున్నారు. ఇటీ వల పార్టీలో చేరి, ఆర్మూర్ నుంచి టిక్కెట్టు ఆశిస్తున్న గోర్తె రాజేందర్, పొద్దుటూరి వినయ్‌రెడ్డి ఎవరికి వారుగా ఆయా మండలాల్లో పర్యటనలు చేస్తున్నారు. బాల్కొండ నియోజకవర్గంలో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ముత్యాల సునీల్‌రెడ్డి ముమ్మరంగా తిరుగుతున్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి కాటపల్లి నగేష్‌రెడ్డి, అరికెల నర్సారెడ్డి, బాడ్సి శేఖర్‌గౌడ్ రెగ్యులర్‌గా క్షేత్రస్థాయి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. సర్వేల నేపథ్యంలో తాము ముందంజలో ఉన్నామని, తమకే టిక్కెట్టు అంటూ వీరిలో పలువురు చెప్పుకుంటుండడం గమనార్హం. ఈ క్రమంలో కాంగ్రెస్ శ్రేణుల్లో కొంత మేర గందరగోళం నెలకొని ఉంది. ఇదిలా ఉండగా నిజామాబాద్ అర్బన్ నుంచి దరఖాస్తు చేసుకున్న మాజీ విప్ ఈరవత్రి అనిల్ మాత్రం క్షేత్రస్థాయిలో తిరగడం లేదు.

■ బీజేపీ తరుపున నిజామాబాద్ అర్బన్ నుంచి టిక్కెట్టు రేసులో ఉన్న ధన్‌పాల్ సూర్యనారాయణ క్షేత్రస్థాయిలో ముమ్మరంగా తిరుగుతున్నారు. బాల్కొండ నియోజకవర్గంలో ఏలేటి మల్లికార్జున్ రెడ్డి, బోధన్‌లో మేడపాటి ప్రకాష్‌రెడ్డి, వడ్డి మోహన్ రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గంలో పైడి రాకేష్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్‌లో కులాచారి దినేష్ తిరుగుతున్నారు.

పకడ్బందీగా టెట్ నిర్వహణ

- నిమిషం ఆలస్యమైనా అనుమతిలేదు
- అభ్యర్థులు గంటముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి
- జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్



నిజామాబాద్‌అర్బన్: టెట్ – 2023 (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్)ను శుక్రవారం జిల్లాలో పకడ్బందీగా నిర్వహిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదన్నారు. అభ్యర్థులు గంట ముందుగానే సెంటర్‌కు చేరుకోవాలన్నారు. ఉదయం 9.30 గంటల నుండి 12.00 గంటల వరకు మొదటి సెషన్ లో జరిగే పేపర్–1 పరీక్షకు జిల్లాలో 15,263 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా 64 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రెండవ సెషన్‌లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు జరిగే పేపర్–2 పరీక్షకు 11,573 హాజరు కానుండగా, 50 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఒక్కో గదిలో 24 మంది అభ్యర్థులు పరీక్ష రాసేలా ఏర్పాట్లు చేశామన్నారు. సెల్ ఫోన్, క్యాలిక్యులేటర్, స్మార్ట్ వాచ్ వంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతి లేదని, అభ్యర్థులు షూస్ వేసుకోకుండా, చెప్పులు ధరించి రావాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ : 9030282993 ను సంప్రదించాలని సూచించారు.

144 సెక్షన్

ఖలీల్‌వాడి: టెట్ నిర్వహణ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలవుతుందని సీపీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తు ఉంటుదన్నారు.

ఆయుష్ ఆరోగ్య సేవలు బలోపేతం చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ చిత్రామిశ్రా, డీఎంఅండ్‌హెచ్‌వో సుదర్శనం

- దృశ్యమాధ్యంలో ఆయుష్మాన్ భవ ప్రారంభించిన రాష్ట్రపతి

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో ఆయుష్ ఆరోగ్య సేవలను బలోపేతం చేస్తూ, ఆయుర్వేద, యోగ, యునాని, సిద్ధ, హోమియోపతి, నేచురోపతి వైద్య విధానాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. బుధవారం రాష్ట్రపతి ఆయుష్మాన్‌భవ కార్యక్రమాన్ని దృశ్యమాధ్యమంలో గుజరాత్ రాజభవన్ నుంచి ప్రారంభించారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ చిత్రా మిశ్రా ఐడీఓసీలోని వీడియోకాన్ఫరెన్స్ హాల్లో పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా చిత్రామిశ్రా మాట్లాడుతూ కిషోర్ బాలికలు, యువతకు అవగాహన కౌన్సెలింగ్ తోపాటు గ్రామస్థాయిలో ఆరోగ్య సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయుష్ ఆరోగ్య కరదీపికలను పంపిణీ చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం సుదర్శనం మాట్లాడుతూ, ఆయుష్ ఆరోగ్య సేవలతోపాటు రక్తదాన శిబిరాల ను నిర్వహించాలన్నారు. అవయవ దానంపై ప్రజ ల్లో అవగాహన కల్పించాలన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్లను అందిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థలు సూర్య హెల్త్ ఆర్గనైజేషన్ నుంచి ప్రసాద్‌కు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సెక్రెటరీ బుస్స ఆంజనేయులుకు అడిషనల్ కలెక్టర్, ప్రశంస పత్రం అందజేయడంతో పాటు సత్కరించారు. కార్యక్రమంలో ఆయుష్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రమణ మోహన్, జిల్లా సంక్షేమ అధికారిని రసూల్ బి, పిఒడిటిటి డాక్టర్ నాగరాజు, జిల్లా పంచాయ తీ అధికారి జయసుధ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సరిత తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థి ఎవరైనా గెలిపించాలి



కాంగ్రెస్ టికెట్ ఆశావహులతో కలిసి అభివాదం చేస్తున్న పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి నాగరాజు

- ఈ నెల 17న విజయభేరిని విజయవంతం చేయండి
- కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎం నాగరాజు

డిచ్‌పల్లి: ఏఐసీసీ, టీపీసీసీ, ప్రైవేటు సర్వేల ఆధారంగా కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని, అధిష్టానం పార్టీ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేసినా కార్యకర్తలు హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించుకోవాలని నిజామాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, సిరిగప్ప ఎమ్మెల్యే బీఎంనాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం డిచ్‌పల్లిలోని కేఎస్‌ఆర్ గార్డెన్స్‌లో నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరై నాగరాజు మాట్లాడారు. నియోజకవర్గ నాయకులు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పనులు, మళ్లీ అధికారంలోకి వస్తే ఏం చేస్తామనే అంశాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ నెల 17న హైదరాబాద్ తుక్కుగూడలో జరగబోయే కాంగ్రెస్ విజయభేరి సభకు నియోజకవర్గం నుచి పది వేల మంది కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సభకు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, అగ్రనేత రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ముఖ్యఅతిథిలుగా హాజరువుతారని తెలిపారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, రూరల్ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్, జిల్లా నాయకులు శేఖర్‌గౌడ్, ముప్ప గంగారెడ్డి తదితరులు ప్రసంగించారు.పార్టీ మండల అధ్యక్షులు అమృతాపూర్ గంగాధర్, నవీన్‌గౌడ్, పాలసాని శ్రీనివాస్, యాదగిరి, చెలిమెల నర్సయ్య, సంతోష్ రెడ్డి, సుధాకర్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు వేణు రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ ఉద్యోగం వద్దు



- అటవీ శాఖలో ఇమడలేకపోతున్న యువకులైన బీట్ ఆఫీసర్లు
- ఇతర శాఖల ఉద్యోగాలకు ప్రయత్నం
- మంచి జాబ్ రాగానే ప్రస్తుత ఉద్యోగానికి రాజీనామా
- నాలుగేళ్లలో 55కు చేరుకున్న ఖాళీలు
- అడవుల సంరక్షణకు ఎదురవుతున్న ఇబ్బందులు

డొంకేశ్వర్(ఆర్మూర్): అటవీ శాఖలో ఉద్యోగ ఖాళీలు పేరుకుపోతున్నాయి. ఇటీవల కాలంలో ఫారెస్టు బీట్ ఆఫీసర్లు(ఎఫ్‌బీవో)గా నియామకమైన యువ ఉద్యోగులు అటవీ శాఖలో ఇమడలేకపోతున్నారు. టైమింగ్ లేకుండా విధులు నిర్వర్తించడంతో పాటు పని ఒత్తిడి కూడా పెరగడంతో ఎఫ్‌బీవో ఉద్యోగం చేయడానికి ఇష్టపడడం లేదు. పోలీస్, గ్రూప్, ఇతర ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. గడిచిన నాలుగేళ్లలో చాలా మందికి మంచి ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయి. దాదాపు 20 మందికి పైగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగానికి రాజీనామా చేసి అనుకున్న జాబ్‌లో స్థిరపడ్డారు. దీంతో అటవీ శాఖలో ఉద్యోగ ఖాళీల సంఖ్య పెరుగుతూ వస్తోంది. జిల్లాలోని అడవులను సంరక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం పరీక్షల ద్వారా బీట్ ఆఫీసర్లను నియమించింది. నాలుగేళ్ల క్రితం సుమారు 80 మంది వరకు నియామకం అయ్యారు. తద్వారా జిల్లాలో 131 బీట్లకు సరిపడా ఆఫీసర్లు వచ్చారు. కానీ, కొంతమంది యువ ఉద్యోగులు మాత్రం స్థిరపడలేకపోయారు. అడవులు, వన్య ప్రాణులను సంరక్షించడంతో పాటుగా అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా పని చేయడం వీరి ప్రధాన కర్తవ్యం. ఇటీవల ప్రభుత్వం గిరిజనులకు పోడు పట్టాలను పంపిణీ చేయడంతో జిల్లాలో కొత్త సమస్య వచ్చిపడింది. పలు చోట్ల పోడు భూములను దున్నడంతో బీట్ ఆఫీసర్లు అటవీ భూమిని కాపాడలేకపోతున్నారు. బెదిరింపులు, దాడులు జరగడంతో ఉద్యోగం చేయడానికి జంకుతున్నారు. భద్రత లేని ఉద్యోగం వద్దని కొందరు వేరే ప్రభుత్వ ఉద్యోగాలకు వెళ్లగా, ఇంకా చాలా మంది సెలవులు పెట్టి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారు.

ఉన్నవారికి అదనపు బీట్లు..

జిల్లాలో ప్రస్తుతం 76 మంది ఎఫ్‌బీవోలు పని చేస్తుండగా, 55 పోస్టులు ఖాళీలున్నాయి. దీంతో అటవీ శాఖ అధికారులు ప్రస్తుతం పని చేస్తున్న బీట్ ఆఫీసర్లకే అదనపు బీట్లు అప్పజెప్తున్నారు. నిబంధనల ప్రకారం ఒక బీట్‌కు అంటే 1500–2000 ఎకరాలకు ఒక బీట్ ఆఫీసర్ ఉండాలి. అయితే ఎఫ్‌బీవోల ఖాళీలతో ఒక్కొక్కరికి రెండు నుంచి ఐదు బీట్లు ఇచ్చి అదనపు భారం వేస్తున్నారు. దీంతో పని ఒత్తిడి పెరుగుతోందని ఎఫ్‌బీవోలు వాపోతున్నారు. ప్రధానంగా అటవీ భూములు, పోడు సమస్యలు ఎక్కువగా ఉన్న ఇందల్వాయి, సిరికొండ, వర్ని రేంజ్‌ల పరిధిలో చాలా ఎఫ్‌బీవో పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఈ రేంజ్‌లలో అడవుల సంరక్షణ కష్టంగా మారింది.

రేంజ్‌ల వారీగా ఎఫ్‌బీవో పోస్టులు, ఖాళీల వివరాలు..

రేంజ్ పేరు	బీట్స్	వర్కింగ్ పోస్టులు	ఖాళీలు
నిజామాబాద్ నార్త్	11	06	05
నిజామాబాద్ సౌత్	13	11	02
ఇందల్వాయి	35	18	17
వర్ని	19	12	07
ఆర్మూర్	15	06	09
కమ్మర్‌పల్లి	18	13	05
సిరికొండ	20	10	10
మొత్తం	131	76	55

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం



జిల్లాలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల కొరత ఉన్న విషయం వాస్తవమే. వేరే ఉద్యోగాలు రావడంతో చాలా మంది ఎఫ్‌బీవో ఉద్యోగాన్ని వదులుకుంటున్నారు. ప్రభుత్వం మళ్లీ రిక్రూట్ చేసి పోస్టులను నింపాల్సి ఉంటుంది. అప్పటి వరకు అడవుల రక్షణకు ఇబ్బంది లేకుండా ఉన్న సిబ్బందితోనే పని చేయిస్తున్నాం.

– వికాస్ మీనా, జిల్లా అటవీ శాఖ అధికారి

భర్తీ చేస్తేనే ఒత్తిడి తగ్గుతుంది



అటవీ శాఖలో ఉద్యోగం అంటే ఎంతో బాధ్యతతో పని చేయాల్సి ఉంటుంది. నిర్ణీత సమయమంటూ లేకుండా పని చేస్తున్న ఫారెస్టు ఉద్యోగులపై, ముఖ్యంగా ఎఫ్‌బీవోలపై ఒత్తిడి తగ్గాలంటే ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వం భర్తీ చేస్తే బాగుంటుంది.

– కె. సుధాకర్, జిల్లా అధ్యక్షులు, తెలంగాణ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్

కేజీబీవీని సందర్శించిన మంత్రి వేముల



పాఠశాలను తనిఖీ చేస్తున్న మంత్రి వేముల

భీమ్‌గల్: కలుషిత ఆహారం తిని విద్యార్థినులు అస్వస్థకు గురైన నేపథ్యంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి బుధవారం భీమ్‌గల్‌లోని కస్తూర్బా గాంధీ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫుడ్ పాయిజన్ కావడానికి కారణాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు ప్రభుత్వం మెను ప్రకారం శుభ్రమైన భోజనం అందించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వంటగది, స్టోర్ రూం, బాత్రూమ్స్ పరిశుభ్రంగా ఉండటానికి చేయవలసిన పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంత్‌కు ఫోన్ చేసి మాట్లాడారు.

పాఠశాల గేటుకు తాళం వేసి నిరసన



వర్ని (మోస్రా): మండలంలోని చింతకుంట హైస్కూల్లో పరిసరాల అపరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు బుధవారం పాఠశాల గేటుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో నీరు నిలిచి ఉండడం ద్వారా దుర్గంధపు వాసన వస్తోందని, పిచ్చి మొక్కలు మొలవడంతో క్రిమి కీటకాలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. గత కొన్ని నెలలుగా పాఠశాల అపరిశుభ్రత పై ఉపాధ్యాయులకు, విద్యా కమిటీ సభ్యులకు, సర్పంచ్ కు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. పాఠశాల ఆవరణలో శుభ్రం చేయించి పరిశుభ్రతను పాటించే విధంగా చర్యలు తీసుకుంటామని గ్రామ పెద్దలు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

క్లుప్తంగా

16 నుంచి జెండా జాతర



నిజామాబాద్ సిటీ: నగరంలోని జెండా బాలాజీ ఆలయంలో జెండా జాతర ఉత్సవాలను ఈ నెల 16 నుంచి 29 వరకు నిర్వహించనున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ తెలిపారు. ఆలయంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను సహాయ కమిషనర్, ఆలయ కమి టీ చైర్మన్ జాలిగాం గోపాల్, ఆలయ కార్యనిర్వాహణాధికారి గింజుపల్లి వేణు బుధవారం ఆవిష్కరించారు.ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ డైరెక్టర్లు నర్సింగ్‌రావు, రాముగౌడ్, అలువేలు మంగ, ఆలయ అర్చకుడు నాగరాజు,ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి తగ్గిన వరద

బాల్కొండ: ఎస్సారెస్పీలోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో బుధవారం మధ్యాహ్నం వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు నిలిపి వేశారు. ప్రాజెక్ట్‌లోకి 8968 క్యూసెక్కుల వరద వచ్చి చేరింది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 5 వేలు, లక్ష్మి కాలువ ద్వారా 150, ఆవిరి రూపంలో 666 క్యూసెక్కుల నీరుపోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగుల కాగా బుధవారంసాయంత్రానికి అదే స్థాయి నీటి మట్టంతో ఉంది.

భీమ్‌గల్‌లో కేజీబీవీ ఖాళీ



మోర్తాడ్/భీమ్‌గల్: మండలంలోని కేజీబీవీలో ఫుడ్‌పాయిజన్ అయిన నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లడంతో పాఠశాల బుధవారం ఖాళీ అయింది. పరిస్థితులు సరిదిద్దుకున్నాక తమ పిల్లలకు పంపిస్తామని ఉపాధ్యాయులకు చెప్పారు. వినాయక చవితి తరువాతే విద్యార్థినులు కేజీబీవీకి వచ్చే అవకాశం ఉంది.

కస్తూర్బా విద్యార్థినుల డిశ్చార్జ్

ఖలీల్‌వాడి: భీమ్‌గల్ పట్టణంలోని కేజీబీవీలో ఫుడ్‌పాయిజన్‌తో జీజీహెచ్‌లో చికిత్స పొందిన 103 మంది విద్యార్థినులు బుధవారం డిశ్చార్జ్ అయ్యారు. ఫుడ్‌పాయిజన్‌తో వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి తగ్గిన 83 మంది విద్యార్థినులను మంగళవారం రాత్రి జీజీహెచ్‌కు సంబంధించిన రెండు బస్సుల్లో భీమ్‌గల్‌కు తరలించారు. 20 మంది విద్యార్థినులు బుధవారం మధ్యాహ్నం కోలుకోవడంతో బస్సులో తరలించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ తెలిపారు.

20న వాహనాల వేలం

ఖలీల్‌వాడి: నగరంలోని పోలీస్‌కమిషనర్ కార్యాలయ ఆవరణలో పలు వాహనాలకు ఈ నెల 20న వేలం నిర్వహించనున్నట్లు సీపీ సత్యనారాయణ బుధవారం తెలిపారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పీఎస్‌లలో ఆచూకీ లేకుండా వదిలేసిన బైక్‌లు, ఆటోలతో 226 వాహనాలను వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8712659702 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కేజీబీవీ అధికారికి షోకాజ్ నోటీసు జారీ

నిజామాబాద్‌అర్బన్: భీమ్‌గల్‌లోని కేజీబీవీ ప్రత్యేక అధికారికి డీఈవో దుర్గాప్రసాద్ బుధవారం షోకాజ్ నోటీసును జారీ చేశారు. కేజీబీవీలో 103 మంది విద్యార్థినులు సోమవారం అస్వస్థతకు గురికావడంతో జిల్లా అధికారులు విచారణ చేపట్టారు. బుధవారం మంత్రి ప్రశాంత్‌రెడ్డి కేజీబీవీని సందర్శించారు. కేజీబీవీ ప్రత్యేక అధికారిణి ఆగస్టు 13న నియామకం కాగా పలు సందర్భాల్లో సెలవుల్లో వెళ్లారు. కేజీబీవీలో నిర్లక్ష్య వైఖరిపై మంత్రి ప్రశాంత్‌రెడ్డి సీరియస్ అయ్యారు. దీంతో ప్రత్యేక అధికారికి డీఈవో నోటీసులు జారీ చేశారు.

అమ్మో.. చిన్నాపూర్ గండి

- కత్తులతో బెదిరించి నగదు దోచుకుంటున్న దుండగులు
- వరుస ఘటనలతో వెలుగులోకి వచ్చిన వైనం
- చుట్టుపక్కల గ్రామాల నిందితులే దాడులకు యత్నం!



చిన్నాపూర్ గండికి వెళ్లే దారి ఇదే

మాక్లూర్: మండలంలోని చిన్నాపూర్ గండి ప్రాంతంలో అందమైన అడవి, ప్రభుత్వం ఏర్పాటు చేసిన అర్బన్ పార్కు అందాలను చూసే వన ప్రేమికులకు వరుస దొంగతనాల దాడులతో చేదు అనుభవం ఎదురవుతోంది. ఈ గండిలో ప్రవేశించే వారిని దుండగులు దాడి చేస్తూ నగదును దోచుకెళ్తున్నారు. ఒకప్పుడు ఈ ప్రాంతంలో ప్రయాణమంటేనే జనం జంకుతుండేవారు. పొరపాటున మూత్రవిసర్జన కోసం వాహనం నిలిపి అడవిలోకి వెళ్తే ఇక అంతేసంగతి. దొంగల చేతిలో బలైపోవాల్సిందే. ఇలా గతంలో అనేక ఫిర్యాదులు రావడంతో స్పందించిన నాటి ఎస్సై సంతోష్‌కుమార్ చాకచక్యంగా వ్యవహరించారు. ఓ మహిళతో మారువేశంలో గండిలోని ఓ ప్రాంతంలో సంచరించి దొంగలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇలా మిగతా దొంగల విషయాన్ని రాబట్టారు. నాటి నుంచి ఈ ప్రాంతంలో దొంగతనాలు తగ్గుముఖం పట్టింది. గత నెల రోజుల నుంచి మళ్లీ ఈ దాడులు ప్రారంభమైనట్లు తాజా ఘటనల ద్వారా తెలుస్తోంది.

నందిపేట మండలం వన్నెల్ (కె) గ్రామానికి చెందిన గూండ్ల సాయికుమార్ తన స్నేహితురాలితో కలిసి చిన్నాపూర్ గండిలోని ఓ ప్రాంతంలో భోజనం చేస్తుండగా పగటి దొంగలు కత్తులు చూపి వారి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలతో పాటు నగదు తీసుకుని పారిపోయారు. వారు వెంటనే మాక్లూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా గతంలో ఎస్సై యాదగిరిగౌడ్ విచారించి దొంగతనానికి పాల్పడిన వ్యక్తి కల్లెడి గ్రామానికి చెందిన కొరిమి రాజుగా గుర్తించి పట్టుకున్నారు. రూ. 10వేల నగదుతో పాటు, బంగారు ఆభరణాలను రికవరీ చేసి జైలుకు పంపారు. తాజాగా ఈ నెల 12న ఆర్మూర్ మండలం మునిపల్లికి చెందిన నూతన వధూవరులు నిజామాబాద్ వెళ్లి తిరుగు ప్రయాణంలో చిన్నాపూర్ గండిలో ఉన్న అర్బన్ పార్కును తిలకించేందుకు వెళ్లారు. పార్కుకు తాళం వేసి ఉండడంతో ఎదురుగా ఉన్న అటవీ అందాలను తిలకించేందుకు వెళ్తుండగా ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. ఆ ప్రాంతంలో కారు ఆగి ఉండడాన్ని గమనించి పెద్దగా కేకలు వేయడంతో దొంగలు పారిపోయినట్లు బాధితుల ద్వారా తెలిసింది. గండిలో దొంగతనాలకు పాల్పడే వారు చుట్టుపక్కల ఉన్న తండాలు, ఒడ్డెర కాలనీలతో పాటు కల్లెడి, చిన్నాపూర్, రాంచంద్రాపల్లి, గుత్ప గ్రామాలకు చెందిన కొందరు పగటి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ముందుగా గొర్రె కాపర్లు అందించిన సమాచారం మేరకు సుమారు 5గురు వ్యక్తుల్లో ఒకరు ఎత్తైన కొండ మీది నుంచి అడవిలోకి వచ్చేవారిని గుర్తిస్తాడు. ఆ విషయాన్ని వెంటనే కిందున్న వారికి సమాచారం అందిస్తాడు. వారు వెంటనే పార్కుకు వచ్చే వారిపై కత్తులతో బెదిరించి నగదు దోచుకుంటారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి గండిలో దొంగతనాల నివారణకు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దొంగతనాలను అరికట్టాలి



చిన్నాపూర్ గండిలో ఇటీవల పగటి దొంగతనాలు ఎక్కువయ్యాయి. పోలీసులు నిఘాపెట్టి దొంగతనాలను అరికట్టాలి. పాత దొంగలే తిరిగి ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

–గంగాధర్, గ్రామస్తుడు

నిందితులను పట్టుకుంటాం



మండలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టాను. చిన్నాపూర్‌లో జరిగే పగటి దొంగతనాలపై విచారణ చేపడుతాం. ఆ ప్రాంతాల్లో ఇద్దరు కానిస్టేబుళ్లతో విధులు నిర్వహిస్తాం. త్వరలో దొంగలను పట్టుకుని జైలుకు పంపుతా.

–సుధీర్‌రావు, ఎస్సై, మాక్లూర్

సర్వే ప్రకారమే అభ్యర్థులకు టికెట్లు

- కర్ణాటక తరహాలోనే అభ్యర్థుల ఎంపిక
- జిల్లా పార్లమెంట్ ఇన్‌చార్జి, సిరిగప్ప ఎమ్మెల్యే బీఎం నాగరాజు



మాట్లాడుతున్న సిరిగప్ప ఎమ్మెల్యే నాగరాజు

ఖలీల్‌వాడి: సర్వేలో ఉత్తమ ఫలితాలు వచ్చిన వారికే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు టికెట్లు అందిస్తుందని నిజామాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, సిరిగప్ప(కర్ణాటక) ఎమ్మెల్యే బీఎం నాగరాజు అన్నారు. నగరంలోని కాంగ్రెస్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ కోసం పని చేసే వారికి కాంగ్రెస్ సముచిత స్థానం కల్పిస్తుందని అన్నారు. ఎన్నికల్లో పార్టీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రజలను ఏ విధంగా మోసం చేస్తోందో ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ నెల 17న తుక్కుగూడలో నిర్వహించే కాంగ్రెస్ విజయభేరి సభకు సోనియాగాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే రానున్నట్లు తెలిపారు. సభను పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కేశవేణు, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్, ముప్పాగంగారెడ్డి, బాడ్సి శేఖర్‌గౌడ్ రామర్తి గోపి, రాజనరేందర్‌గౌడ్, సంతోష్, వేణురాజ్, అంతరెడ్డి రాజారెడ్డి, సిరికొండ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏజెంట్‌పై ఫిర్యాదు

ఖలీల్‌వాడి: నగరంలోని కంఠేశ్వర్‌కు చెందిన ఆల్‌అదస్ ట్రావెల్స్ నడుపుతున్న ఏజెంట్ ఎండీ అజీమ్ కువైట్‌కు పంపిస్తానని నకిలీ వీసా ఇవ్వడంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వినాయక్‌నగర్‌కు చెందిన ఎస్‌కే అన్వర్ హుస్సేన్ తన బావమరిదిని కువైట్‌కు పంపించాలని అజీమ్‌ను సంప్రదించారు. వీసాకు రూ.లక్ష,20వేలు అవుతుందని చెప్పి వసూలు చేశాడు. ఆగస్టు 15న వీసా కాపీ ఇచ్చిన అజీమ్ కువైట్ పంపేందుకు తప్పించుకు తిరుగుతున్నాడు. అనుమానం వచ్చిన హుస్సేన్ ముంబాయి వెళ్లి వీసా కాపీని అధికారులతో తనిఖీ చేయగా ఫేక్ అని తేలింది. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు అజీమ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువతి మృతి



ప్రియాంక (ఫైల్)

పిట్లం(జుక్కల్): మండలంలోని పోతురెడ్డిపల్లి శివారులోని బొమ్మడి చెరువులో ప్రమాదవశాత్తు ఓ యువతి కాలుజారిపడడంతో మృతి చెందినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. తాండ వాసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పోతురెడ్డిపల్లి తండాకు చెందిన శ్రీనివాస్ అన్షిబాయిల కుమార్తె ప్రియాంక (19) బుధవారం గేదెలకు నీరు తాగించేందుకు చెరువుకు వెళ్లగా ప్రమాదవశాత్తు పడి మృతి చెందిందన్నారు. చెరువులో ప్రియాంక కొట్టుకుపోతున్న విషయాన్ని గమనించిన ఓ యువకుడు తండావాసులతో కాపాడినా అప్పటికే ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని ఖలీల్‌వాడిలో ఆసుపత్రికి వచ్చిన మతిస్థిమితం లేని యువతి అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. జగిత్యాల జిల్లా వేములకుర్తి గ్రామానికి చెందిన గంగానర్సు మతిస్థిమితం లేని తన కుమార్తెతో కలిసి ఆసుపత్రికి వచ్చింది. డాక్టర్ వద్ద చూయించుకున్న తర్వాత మందులు తీసుకునే సమయంలో యువతి అదృశ్యమైంది. చుట్టుపక్కల ఎక్కడా వెతికినా ఆచూకీ లభించలేదు. గంగానర్సు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బైక్‌ల స్వాధీనం



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి, హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో బైక్‌లు చోరీ చేసిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేశ్ బుధవారం తెలిపారు. బోధన్‌కు చెందిన షేక్ సోహేల్, రాకాసిపేట్‌కు చెందిన సయ్యద్ జమీల్ బుధవారం ఉదయం 4.30 గంటలకు నంబర్‌ప్లేట్ లేని బైక్‌పై నిజామాబాద్ నుంచి డిచ్‌పల్లి వైపు వెళ్తుండగా రైల్వేస్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్సై వారిని విచారించారు. వీరిపై అనుమానం రావడంతో విచారణ చేపట్టగా చోరీ చేసినట్లు నిందితులు తెలిపారు. అనంతరం వీరి నుంచి 12 పల్సర్ బైక్‌లు, ఒక రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్, ఒక ఆక్టివాను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నిందితులను పట్టుకున్న ఎస్సై మహేశ్, సిబ్బంది సుధాకర్, రాజేశ్వర్, సర్దార్, రాము, సందీప్‌ను సీపీ సత్యనారాయణ, ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ కృష్ణ అభినందించారు.

నిందితుడి రిమాండ్



నిజాంసాగర్(జుక్కల్): డబ్బుల కోసం అమ్మమ్మను హత్యచేసిన బాలపోశయ్యను బాన్సువాడ పట్టణ పోలీసులు బుధవారం రిమాండ్‌కు తరలించారు. నిజాంసాగర్ మండలం తెల్గాపూర్‌కు చెందిన దుంపల అక్కవ్వ(70)ను ఈ నెల 11న బాలపోశయ్య హత్య చేసి పారిపోయాడు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



ప్రవీణ్(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాను చేస్తున్న పని ఇష్టం లేక, ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని బొల్లారంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గడ్డమీది ప్రవీణ్(28) తల్లి 20 ఏళ్ల క్రితం చనిపోయింది. ప్రవీణ్ అక్కకు గతంలో వివాహం కాగా భర్త మృతి చెందాడు. నాటి నుంచి వారితోనే ఉంటోంది. తండ్రి ఆరోగ్యం సైతం బాగా లేకపోవడంతో పాటు కుటుంబ ఆర్థికపరిస్థితితో ప్రవీణ్ చదువు మానేసి మేస్త్రీ పని చేసేవాడు. తాను చేస్తున్న పని తనకు నచ్చడం లేదని పలుమార్లు తండ్రితో చెప్పేవాడు. ఈ క్రమంలో మంగళవారం జప్తిజాన్కంపల్లిలో నిర్వహించిన బోనాల పండుగకు వెళ్లొస్తానని చెప్పి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. బుధవారం తన పొలంలో చెట్టుకు ఉరేసుకొని కనిపించడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

కోటగిరి (రుద్రూర్): కోటగిరి మండల కేంద్రానికి చెందిన బర్ల సత్యనారాయణ (55) అనే రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడని గ్రామస్తులు బుధవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన సత్యనారాయణ తన పొలంలో గడ్డి కోస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. విషయం గమనించిన స్థానికులు మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయమై ఎస్సైని సంప్రదించగా ఫిర్యాదు అందలేదని ఎస్సై పేర్కొన్నారు.

మృతదేహం కోసం గాలింపు



కాలువలో గాలిస్తున్న జాలర్లు

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్ వద్ద వరద కాలువలో దూకి బలవన్మరణానికి పాల్పడిన ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన షేక్ రియాజ్(30) మృతదేహం కోసం బుధవారం గాలింపు చర్యలు చేపట్టారు. రియాజ్ అప్పుల బాధ తట్టుకోలేక కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. స్థానిక జాలర్లు గాలిస్తున్నా మృతదేహం ఆచూకీ లభించలేదని ఎస్సై గోపి తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నృత్య కళ.. ప్రతిభ భళా..



విద్యార్థులతో ఏసీపీ కిరణ్‌కుమార్

అలరించిన నృత్యోత్సవం-2023

నిజామాబాద్ సిటీ: సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభ బయటకు వస్తుందని నగర మేయర్ దండు నీతూకిరణ్ అన్నారు. నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిజామాబాద్ డిస్ట్రిక్ట్ డ్యాన్స్ అసోసియేషన్, తెలంగాణా భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నృత్యోత్సవ్-2023 కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మేయర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నృత్యోత్సవ కార్యక్రమంలో 47 పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొని నృత్య ప్రదర్శనలు చేశారు. విద్యార్థుల ప్రదర్శనలు ఎంతో బాగున్నాయని మేయర్ కొనియాడారు. ముగింపు కార్యక్రమానికి ఏసీపీ కిరణ్‌కుమార్ హాజరై మాట్లాడారు. జిల్లా నుంచి డ్యాన్స్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఏసీపీ ప్రశంసాపత్రాలు, స్కూల్స్ యాజమాన్యాలకు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో డీసీవో సింహాచలం, సుభాష్, వెంగళరావు, కార్తిక్, సాయి లవోల, ఈశ్వరయ్య, డాక్టర్ వికాస్, డాక్టర్ కిరణ్, జిల్లా డ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తొగటి ఆనంద్‌బాబు, కార్యదర్శి తోట సతీశ్, నవనీత, సిద్ధార్థ్, సాయిబాబు, వినయ్‌కుమార్, అమృతా, పసునూరి వినయ్‌కుమార్, తోట ప్రశాంత్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభ్యాసనతో సామర్థ్యాల మెరుగు



రిసోర్స్‌పర్సన్లను సన్మానిస్తున్న కవిత

ఆర్మూర్‌టౌన్: ఉన్నతి అభ్యాసనాభివృద్ధి కార్యక్రమం ప్రతి పాఠశాలలో విజయవంతంగా నిర్వహిస్తే ప్రతి విద్యార్థి సామర్థ్యాలు ఎంతో మెరుగుపడతాయని ఉన్నతి శిక్షణ కార్యక్రమం ప్రాజెక్ట్ డైరెక్టర్ కవిత అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆర్మూర్, భీంగల్ పాత మండలాల స్థాయి తెలుగు భాష ఉపాధ్యాయులకు మూడు రోజుల పాటు ఉన్నతి శిక్షణ కార్యాక్రమం నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేయడమే ఉన్నతి కార్యక్రమ ఉద్దేశమన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చిన కాసర్ల నరేశ్‌రావు, శారద, హనుమాండ్లు, గంట్యాల ప్రసాద్, ప్రవీణ్ శర్మ, సమన్వయకర్త కోకిల నాగరాజును సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీస్‌ను పటిష్ఠపర్చాలి

- సీపీ సత్యనారాయణ



మాట్లాడుతున్న సీపీ సత్యనారాయణ

ఖలీల్‌వాడి: ఫ్రెండ్లీ పోలీస్‌ను పటిష్ఠపర్చాలని సీపీ సత్యనారాయణ అన్నారు. నగరంలోని నాలుగో పోలీస్‌స్టేషన్‌ను సీపీ బుధవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పీఎస్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. వినాయక చవితి, మిలాద్-ఉన్-నబీ పండుగల సందర్భంగా పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. సీపీ వెంట ఏసీపీ కిరణ్‌కుమార్, ఎస్సై సంజీవ్ ఉన్నారు.

ఏటికి ఎదురీదుతున్న జాలర్లు



బాల్కొండ: నీటితో సహవాసం.. చేపతో సహజీవనం చేసే జాలర్లు ఏటికి ఎదురీదుతు చేపల వేట కొనసాగిస్తున్నారు. ప్రాజెక్ట్ నుంచి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల కొనసాగుతోంది. వరద గేట్ల ముందు చేపల వేట చేయొద్దని మత్స్యకారులకు సూచిస్తున్నా పట్టించుకోవడం లేదని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొంటున్నారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక కార్యక్రమం

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఓటరు నమోదుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అవగాహన అధికారులు తెలిపారు. విద్యార్థులు తమ ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించారు.

కొడుకును చంపిన తల్లికి జీవితఖైదు

ఖలీల్‌వాడి: కన్న కొడుకును చంపిన తల్లికి జీవిత కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల బుధవారం తీర్పు వెల్లడించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏర్గట్ల మండలంలోని తొర్తి గ్రామానికి చెందిన గుండ నవ్యకు తాళ్ల రాంపూర్ గ్రామానికి చెందిన గుండ అభిషేక్‌తో 2015లో వివాహం జరిగింది. వీరికి నాగేంద్ర(4) బాబు ఉన్నాడు. వివాహానికి ముందు నవ్య ఆర్మూర్ మండలంలోని ఖానాపూర్‌కు చెందిన నరేశ్‌తో ప్రేమ వ్యవహారం నడిపింది. పెళ్లి తరువాత కూడా వీరు ప్రేమ పేరుతో తమ వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. ఇది గమనించిన భర్త నవ్యకు సర్దిచెప్పాడు. దీంతో నవ్య కుమారుడితో కలిసి తల్లిగారింటికి వెళ్లింది. కుమారుడిని చూసేందుకు అభిషేక్ అత్తాగారింటికి అప్పుడప్పుడు వెళ్లేవాడు. తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా నిలుస్తున్న కుమారుడు నాగేంద్రను హత్య చేయాలని నవ్య భావించింది. అదే సమయంలో అభిషేక్ దుబాయి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన నవ్య 2020 నవంబర్ 12న ఇంట్లో ఎవరూ లేని సమయంలో కుమారుడి గొంతు నులిమి హత్య చేసింది. న్యాయ విచారణలో నవ్య చేసిన నేరం రుజువు కావడంతో జీవిత కారాగార శిక్ష తోపాటు రూ.2వేల జరిమాన విధించారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా ఆరు నెలల జైలుశిక్ష అనుభవించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నారు. రెండవ ముద్దాయి నరేశ్‌పై నేరారోపణ రుజువు కానందున నిర్దోషిగా విడుదల చేశారు. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవిరాజ్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

హత్య కేసులో మరొకరికి..

కామారెడ్డి క్రైం: హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు విధిస్తూ కామారెడ్డి కోర్టు బుధవారం తీర్పు వెల్లడించింది. మద్నూర్ మండలం మదనహిప్పర్గ గ్రామానికి చెందిన గంగాధర్‌కు అదే గ్రామానికి చెందిన విరాధర్ మనోహర్‌కు మధ్య పాత కక్షలు ఉండేవి. 2014 నవంబర్ 13 న పాత కక్షలతో మనోహర్‌పై గంగాధర్ కత్తితో దాడి చేశాడు. గమనించిన మనోహర్ తమ్ముడు సంతోష్ అడ్డు రావడంతో అతడిని కూడా కత్తితో పొడిచాడు. సంతోష్ మృతి చెందడంతో గంగాధర్‌పై పోలీసులు హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన అదనపు జిల్లా జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్ నిందితుడు గంగాధర్‌కు జీవిత ఖైదు, రూ.15 వేలు జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారు. సాక్ష్యాధారాలను సక్రమంగా ప్రవేశపెట్టడం, నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి బిచ్కుంద సీఐలు వెంకటేశం, సర్దార్ సింగ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంద రమేశ్, ప్రస్తుత సీఐ కృష్ణ, లైజనింగ్ ఆఫీసర్లు విఠల్, హనుమాండ్లు, కానిస్టేబుల్ విక్రంరెడ్డిని ఎస్పీ శ్రీనివాసరెడ్డి అభినందించారు.

మొబైల్ షాపులో చోరీ

రుద్రూర్: మండలంలోని సులేమాన్‌నగర్‌లో ఉన్న ఓ మొబైల్ షాపులో దుండగులు మంగళవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. షాప్ తాళాలు పగులగొట్టి సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బోధన్‌లో గొలుసు..

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని హనుమాన్ టేకిడీ కాలనీ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై మహిళ మెడలో ఉన్న గొలుసును బుధవారం చోరీ చేశారు. కాలనీకి చెందిన మహేశ్వరీ పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో స్వీపర్‌గా పనిచేస్తోంది. విధులు ముగించుకొని సాయంత్రం ఇంటికి వస్తుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు మెడలో ఉన్న 3 తులాల బంగారు గొలుసు లాక్కొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మోతె గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ప్రభాకర్ బుధవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి పేకాట ఆడుతున్న వారి నుంచి రూ. 1300 నగదు స్వాధీనం చేసుకొని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడిలో ఏఎస్సై రంగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కులాస్‌పూర్ తండాకు చెందిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్ రాము బుధవారం తెలిపారు. గ్రామంలోని తన పంటను దున్నేసిన ట్రాక్టర్‌ను సీజ్ చేయాలని లకావత్ చందర్, గంగామణి, రుక్మాబాయి, చింటు స్టేషన్‌కు వచ్చి పోలీసులతో అమర్యాదగా ప్రవర్తించి పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో హెడ్ కానిస్టేబుల్ సామిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.